## క్లుప్తంగా

### విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ



దాచేపల్లి: మండలంలోని ముత్యాలంపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు పరీక్ష సామగ్రిని ఆదివారం అందజేశారు. విద్యార్థులకు పౌష్టికాహారం కోసం గ్రామానికి చెందిన మద్దినేని వెంకట నరసింహారావు రూ.5వేలు అందించారు. పిట్టల రామకోటిరెడ్డి, కటికాల రమేష్ విద్యార్థులకు పెన్నులు, పెన్సిల్స్, జామెంట్రీ బాక్స్‌లు, ప్యాడ్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం బి.శ్యాంకుమారి, ఉపాధ్యాయులు గుదిబండి శ్రీనివాసరెడ్డి, అంకె వాసుదేవరావు పాల్గొన్నారు.

### పీటీజీ పాఠశాలలో..



విజయపురిసౌత్: మండల కేంద్రంలోని పీటీజీ బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు లుక్ కల్చర్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో షేక్ సుభాని, షేక్ ఫిరోజ్‌కలు విద్యార్థులకు ఎగ్జామ్ కిట్లను అందజేశారు. సభ్యులు హుస్సేన్, జానీ, ఖాసిం, అబ్దుల్, విజయ్, జాకీర్ సూరి, శ్రీను, ఫయాజ్ పాల్గొన్నారు.

### వినియోగంలోకి ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్



కారెంపూడి: మండలంలోని పెదకొదమగుండ్ల గ్రామంలో నిరుపయోగంగా ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం (ఎస్‌డబ్ల్యూ పీసీ)షెడ్‌ను ఆదివారం వినియోగంలోకి తీసుకువచ్చారు. వర్మి కంపోస్టు ఎరువు తయారీకి చెత్త నింపిన తొట్లలోకి వానపాములను ఎంపీడీఓ జి.శ్రీనివాసరెడ్డి వదిలారు. షెడ్ పరిసరాలలో మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి సర్పంచ్ లక్ష్మయ్య, మాజీ ఎంపీపీ జాస్తి గంగారావు, నాయకులు బొల్నేడి శ్రీనివాసరావు, కోదాటి బాలయ్య పాల్గొన్నారు. ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌ను చక్కగా నిర్మించి వినియోగంలోకి తీసుకువచ్చిన సర్పంచ్, నాయకులను పంచాయతీ ఉద్యోగులను ఎంపీడీఓ అభినందించారు.

### ఘనంగా వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణోత్సవం



మాచర్ల రూరల్: మండలంలోని కంభంపాడు గ్రామంలో ఆదివారం శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణ మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి స్వామి వారికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్త బీరవల్లి సత్యనారాయణరెడ్డి, మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో స్వామి వారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. కల్యాణ మహోత్సవం అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

### 206 మందికి ఉద్యోగాలు



నరసరావుపేట ఈస్ట్: రావిపాడురోడ్డులోని వాగ్దేవి డిగ్రీ కళాశాలలో ఆదివారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాలో 206 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల కార్యదర్శి రాయల శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ కపలవాయి రాజేంద్రప్రసాదు తెలిపారు. హెచ్‌ఆర్ అండ్ కో సంస్థ సహకారంతో ఏర్పాటు చేసిన జాబ్‌మేళాలో పలు సంస్థలు ఉద్యోగాలకు వారిని ఎంపిక చేసుకున్నాయని వివరించారు. ఎంపికైన వారికి రూ.3.60 లక్షల వరకు వార్షిక వేతనం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు కాట్ల రామకోటేశ్వరరావు, ఓగూరి నాగేశ్వరరావు, సూదా సురేష్‌బాబు పాల్గొన్నారు.

### నేడు శ్రీలక్ష్మి తిరుపతమ్మ తిరునాళ్ల

శావల్యాపురం: మండలంలోని పోట్లూరు గ్రామ పంచాయతీ పరిధిలో గంటావారిపాలెం అద్దంకి బ్రాంచ్ కెనాల్ వద్ద వేంచేసియున్న శ్రీలక్ష్మి సమేత తిరుపతమ్మ గోపయ్య స్వామి తిరునాళ్ల వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ ధర్మకర్త గోనుగుంట్ల వెంకటరావు తెలిపారు.

# లాభాల పంట

- మొక్కజొన్న దిగుబడితో రైతుల్లో సంతోషం
- ఎకరాకు 30 నుంచి 50 క్వింటాళ్లు
- ప్రైవేటు కంపెనీల ప్రోత్సాహంతో పెరిగిన సాగు విస్తీర్ణం
- ముందస్తు ధర నిర్ణయంతో గిట్టుబాటు
- ఎకరాకు రూ. 20 వేల ఆర్థిక సాయం



రెంటచింతలలో లోడ్ చేసేందుకు సిద్ధంగా ఉన్న మొక్కజొన్న బస్తాలు

రెంటచింతల: పల్నాటి రైతులకు మొక్కజొన్న ఆశాజనకంగా మారింది. ఇప్పటి వరకు పత్తి, మిరప వంటి వాణిజ్య పంటలను సాగు చేసిన కర్షకులు గిట్టుబాటు ధర లభించక నష్టాలు మిగిల్చుకున్నారు. ఈ ఏడాది మండలంలోని పలు గ్రామాల్లో ఐ.టి.సి, భారతి కంపెనీల ప్రతినిధులు మొక్కజొన్న సాగుకు నేరుగా రైతులనే సంప్రదించారు. విత్తనంతో పాటు ఎకరాకు పెట్టుబడి కింద రూ.20 వేల ఆర్థిక సాయం, గడ్డి, పురుగు మందులతో పాటు రెండుసార్లు గుళికలు అందజేశారు. క్వింటాకు రూ. 3,500ల ముందస్తు ధర కూడా ప్రకటించారు. బాండ్ ప్రకారం పంటను వారే కొనుగోలు చేయడంతో..రైతులకు మార్కెట్ కష్టాలు కూడా తగ్గిపోయాయి. దీంతో తమకు మంచి లాభాలు వచ్చాయని పలువురు రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని రెంటచింతల, రెంటాల, మిట్టగుడిపాడు, సత్యనారాయణపురం క్యాంపు, గోలి, పాలువాయి తదితర గ్రామాల్లో సుమారు 4 వేల ఎకరాల్లో మొక్కజొన్న పంటను సాగు చేశారు. కొందరికి ఎకరాకు కనీసం 25 నుంచి 30 క్వింటాళ్ల దిగుబడి రాగా, ఎక్కువ మందికి 35 నుంచి నుంచి 45 క్వింటాళ్ల వరకు పంట దిగుబడి వచ్చి.. లాభాల పంట పండింది.

#### ఎకరాకు 50 క్వింటాళ్ల దిగుబడి



మొక్కజొన్న పంట ఆరు ఎకరాల్లో సాగు చేశా. ఎకరాకు 50 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ఎకరాకు సుమారు రూ.70 వేల పెట్టుబడి అయ్యింది. ఐటీసీ కంపెనీ బాండ్ ప్రకారం క్వింటా రూ.3,500 చొప్పున పంట కొనుగోలు చేయడంతో మంచి లాభాలు వచ్చాయి.

– గాలి ప్రకాష్‌రెడ్డి, రైతు, రెంటచింతల

#### 16 ఎకరాల్లో మొక్కజొన్న సాగు



కంపెనీ ప్రతినిధులు ముందుగానే గిట్టుబాటు ధర రూ. 3,500 నిర్ణయించారు. బాండ్లు ఇచ్చి కొనుగోలు చేస్తామని చెప్పడంతో నేను 16 ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశా. ఎకరాకు సగటున 25 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. కంపెనీ.. విత్తనంతో పాటు ఎకరాకు రూ. 20 వేలు ఆర్థిక సాయం చేసింది.

– గొంగడి శ్రీనివాసరెడ్డి, కౌలురైతు, మంచికల్లు

#### తక్కువ ఖర్చుతో మంచి లాభాలు



ఈ ఏడాది తక్కువ పెట్టుబడితో రెండు ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశా. ఎకరాకు 40 క్వింటాళ్ల దిగుబడి వచ్చి, లాభాలు వచ్చాయి. కంపెనీ పెట్టుబడి సాయం, మందులు కూడా ఉచితంగా ఇవ్వడం నాలాంటి సన్నకారు రైతులకు మేలు జరిగింది.

– పేర్ల చౌదయ్య, కౌలురైతు, రెంటచింతల

## పాఠశాల ఆస్తులపై జెడ్పీ సీఈఓ విచారణ

సాక్షి ఎఫెక్ట్

కారెంపూడి: స్థానిక జెడ్పీ హైస్కూల్‌పై 'సాక్షి' కథనానికి జిల్లా పరిషత్తు సీఈఓ జ్యోతి బసు స్పందించారు. పాఠాలు చెప్పిన చోటే..పాడు పనులు శీర్షికన కథనం ప్రచురితం కావడంతో.. కారెంపూడి ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డికి ఫోన్ చేసి వివరణ కోరారు. దీంతో సమగ్ర నివేదికను ఎంపీడీఓ జెడ్పీ సీఈఓకు పంపించారు. ఎంతో విలువైన స్థలాన్ని పరిరక్షించాల్సి అవసరం ఉందని లేకుంటే అది అన్యాక్రాంతమయ్యే ప్రమాదం కూడా పొంచి ఉందని నివేదికలో పేర్కొన్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ముందుగా స్థలం చుట్టూ ప్రహరీ నిర్మించాల్సిన ఆవశ్యకత వివరించారు. స్థలంలో ఉన్న ఆస్తుల పరిరక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని సీఈఓకు నివేదించానని తెలిపారు. దీనిపై చర్చించి తగిన చర్యలు తీసుకుంటామని సీఈఓ పేర్కొన్నారని ఎంపీడీఓ చెప్పారు.



పాఠాలు చెప్పిన చోటే.. పాడు పనులు

సాక్షిలో వచ్చిన కథనం

## కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

పిడుగురాళ్ల: రాష్ట్ర ప్రభుత్వం స్వయం ఉపాధి పథకాలకు అర్హత ఉన్న వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బీసీ, ఈబీసీ, కమ్మ, రెడ్డి, ఆర్యవైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ కులాలకు చెందిన 2024–25 ఆర్థిక సంవత్సరంలో కార్పొరేషన్ల సబ్సిడీ రుణాలకు ఈ నెల 22వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. పిడుగురాళ్ల మున్సిపాలిటీ పరిధిలో బీసీ కార్పొరేషన్ 31, ఈబీసీ కార్పొరేషన్ 4, కమ్మ కార్పొరేషన్ 8, రెడ్డి కార్పొరేషన్ 10, ఆర్యవైశ్య కార్పొరేషన్ 4, బ్రాహ్మణ కార్పొరేషన్ ఇద్దరు మొత్తం 59 మందికి ఈ అవకాశాలున్నాయని తెలిపారు.

### అమరజీవి త్యాగాలు మరువలేనివి

రెంటచింతల: తెలుగు ప్రజలకు ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటుకు అమరజీవి పొట్టిశ్రీరాములు త్యాగాలు మరువలేనివని మాజీ ఎంపీపీ గొంటు సుమంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా స్థానిక రామాలయం సెంటర్‌లోని ఆయన విగ్రహానికి మండల ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు ఏచూరి వెంకట సైదయ్యతో కలిసి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం వెంకట సైదయ్య పదో తరగతి విద్యార్థులు 70 మందికి ప్యాడ్‌లు, పెన్నులు పంపిణీ చేశారు. పీహెచ్‌సీ మాజీ చైర్మన్ బి. రామకృష్ణ, మూలి రాజారెడ్డి, ఎస్. శ్రీనివాసరావు, ఆర్యవైశ్య సంఘం నాయకులు నాళం పెదబాబు పాల్గొన్నారు.

## నేడు రెడ్డి పేరంటాలమ్మ ఆలయ ప్రతిష్ట



శాంతి హోమాల్లో భక్తులు



దీపాలంకరణలో ఆలయం

నాదెండ్ల: సాతులూరులో రూ.2 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన శ్రీ రెడ్డి పేరంటాలమ్మ తల్లి ఆలయ ప్రతిష్ట సోమవారం జరగనుంది. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో మూడు రోజులుగా భక్తులు ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహిస్తున్నారు. ఆదివారం ఉదయం సుప్రభాత సేవతో ప్రారంభమై మహాలింగ దేవత, ఆభరణ, శ్రీచక్రనాభవర్ణ పేరంటాలమ్మ తల్లి ఆవరణ, దేవతల వాహనాలు, మూలమంత్ర హోమాలు నిర్వహించారు. ముత్తైదువులు అష్టలక్ష్మి పూజలు నిర్వహించారు. 11 గంటలకు విగ్రహ మూర్తులకు ఔషధ స్నపన, నవనీత క్షీరాధివాసములు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఉత్సవ విగ్రహాలను ట్రాక్టర్‌పై ఏర్పాటు చేసి సంప్రదాయబద్ధ మేళతాళాలతో గ్రామోత్సవం నిర్వహించారు. పూజా కార్యక్రమాలను నెమ్మికంటి నరసయ్య ఆచార్య స్వామిజీ బృందం, వేద పండితులు హత్తులూరి బాలశంకరశాస్త్రి, తియ్యబండి కళ్యాణ కుమారాచార్యులు, ఆలయ ప్రధాన అర్చకులు కొండపర్తి పూర్ణాచార్యులు నిర్వహించారు. సోమవారం ఉదయం 10.41 గంటలకు ప్రతిష్ట కార్యక్రమం నిర్వహించనున్నారు. అన్నదానం చేయనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

### గర్భాశయ క్యాన్సర్‌పై అవగాహన సదస్సు

పిడుగురాళ్లరూరల్: గర్భాశయ క్యాన్సర్ ప్రపంచ వ్యాప్తంగా వేలాది మంది మహిళల జీవితాలను ప్రభావితం చేస్తుందని ఆయా పౌండేషన్, అంకుర, ఉన్నం హాస్పిటల్స్ అధినేతలు డాక్టర్ కృష్ణ ప్రసాద్, ఉన్నం నాగమల్లికార్జునరావు తెలిపారు. జానపాడు గ్రామంలో గర్భాశయ క్యాన్సర్‌పై ఆదివారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. వ్యాధి లక్షణాలను, నివారణ చర్యలను వివరించారు. 9 నుంచి 15 ఏళ్ల బాలికలకు గర్భాశయ క్యాన్సర్ రాకుండా రూ.5 వేల విలువైన వ్యాక్సిన్‌ను 100 మంది బాలికలకు ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నాగదీపిక పాల్గొన్నారు.

## పార్టీలకతీతంగా ముస్లిం సంక్షేమ కమిటీ

నరసరావుపేట: రాబోయే రోజుల్లో పార్టీలకు అతీతంగా నూతన ముస్లిం సంక్షేమ కమిటీని ఏర్పాటు చేసుకోవాలని పలువురు ముస్లిం నాయకులు నిర్ణయించారు. ఆదివారం స్థానిక షాదీఖానాలో అన్ని పార్టీలలోని ముస్లిం పెద్దలు సమావేశమయ్యారు. సమావేశంలో మాజీ మార్కెట్ యార్డు చైర్మన్, జనసేన రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ జిలాని, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ మీరావలి, మాజీ కౌన్సిలర్లు షేక్ మస్తాన్‌వలి, షేక్ గఫార్, నాయకులు బొందాల బాషా, షేక్ గౌస్‌పీరా, షేక్ అయూబ్, షేక్ ఖాదర్‌బాషా, షేక్ ఆద్రుఫ్, హాజీ కరీముల్లా, ఎస్‌జేఎస్ బాజీ, రహమతుల్లా, నర్సింగ్ వలి, అజీజ్, మన్నాన్ షరీఫ్ పాల్గొన్నారు.



షాదీ ఖానాలో సమావేశానికి హాజరైన ముస్లిం నాయకులు

### రైలు ఢీకొని వ్యక్తి మృతి

దాచేపల్లి : మండలంలోని పొందుగల రైల్వేస్టేషన్ వద్ద గుర్తుతెలియని యువకుడి మృతదేహాన్ని జీఆర్పీ పోలీసులు ఆదివారం గుర్తించారు. సుమారు 35 సంవత్సరాల వయసున్న యువకుడు రైలు పట్టాలపై మృతిచెందినట్లుగా గుర్తించి, కేసు నమోదు చేశారు. మృతుడి శరీరంపై లైట్ బిస్కెట్ రంగు ప్యాంట్, లైట్ గ్రీన్ కలర్ టీ షర్ట్, కాళ్లకి నలుపు రంగు చెప్పులు ధరించి ఉన్నాడు. రైలు ఢీకొట్టటంతో తల ఛిద్రమైంది. ఘటనా స్థలాన్ని జీఆర్పీ ఏఎస్ఐ వెంకట్రావ్, కానిస్టేబుల్ రామరాజు పరిశీలించారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పూర్తి వివరాలకు నడికుడి రైల్వేస్టేషన్‌లోని జీఆర్పీ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

## భక్తులకు చలువ పదార్థాల పంపిణీ

నరసరావుపేట ఈస్ట్: శ్రీకల్పవల్లి సేవా ట్రస్ట్, మహాత్మాగాంధీ సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం శ్రీపాండురంగస్వామి ఆలయ ప్రాంగణంలో చలువ పదార్థాలు, పానీయాలు పంపిణీ చేశారు. పేద విద్యార్థినికి ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో ఆయా సంస్థల ప్రతినిధులు వెల్లంపల్లి కేశవరావు, కోడూరి రాము, చేగు వెంకటేశ్వరరావు, మండవ వెంకటరత్నం, రెడ్డి మురళీకృష్ణ పాల్గొన్నారు.



## అదనపు ఆర్థిక సహాయానికి దరఖాస్తుల ఆహ్వానం

నకరికల్లు: ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద గతంలో ఇళ్లు మంజూరు అయిన వారికి అదనంగా ప్రభుత్వం మరికొంత ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు హౌసింగ్ ఏఈ రాములు నాయక్ ఆదివారం తెలిపారు. ఎస్సీ, బీసీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు, పీవీజీటీలకు రూ.1లక్ష అదనంగా ఇస్తుందన్నారు. ఈ అదనపు ఆర్థిక సహాయాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పీఎంఏవై 2.0 అర్బన్, గ్రామీణ పథకం ద్వారా కొత్తగా ఇళ్లు కట్టుకునే వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు మండలంలో 3,813 మంది దరఖాస్తు చేసుకున్నట్లు పేర్కొన్నారు. మార్చి 31వ తేదీ వరకు దరఖాస్తుకు గడువు పెంచారన్నారు. దరఖాస్తు చేసుకునేందుకు భార్యాభర్తల బ్యాంక్ ఖాతా పుస్తకం, ఆధార్‌కార్డు, ఉపాధి హామీ జాబ్‌కార్డు, రేషన్ కార్డు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు తదితర పత్రాలతో సచివాలయంలో గానీ, హౌసింగ్ కార్యాలయంలో గానీ సంప్రదించాలని సూచించారు.

## సాత్వికాహారంతో ఆరోగ్యం మెరుగు



నరసరావుపేట ఈస్ట్: సాత్వికాహారంతో ఆరోగ్యం మెరుగవుతుందని శ్రీవేంకటేశ్వర యోగా సేవా కేంద్రం (మంగళగిరి) వ్యవస్థాపకులు డాక్టర్ వేంకటేశ్వర యోగి తెలిపారు. నరసరావుపేట (రూరల్) శాఖ ఆధ్వర్యంలో రావిపాడురోడ్డులోని ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన 4వ ఉచిత యోగా శిక్షణ శిబిరం ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన ఆనంద మహోత్సవంలో పాల్గొన్న అభ్యాసకులను ఉద్దేశించి టెలికాన్ఫరెన్స్‌లో వేంకటేశ్వర యోగి గురూజీ మాట్లాడారు. యోగా గురువులు కూనిశెట్టి వెంకట జనార్దన్, కాపుగంటి శివప్రసాద్, కనమర్లపూడి శారద తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్సార్ సీపీ నాయకులకు పిన్నెల్లి పరామర్శ



గోపాలరెడ్డిని పరామర్శిస్తున్న పిన్నెల్లి

మాచర్ల రూరల్: అనారోగ్యంతో ఇబ్బంది పడుతూ శస్త్ర చికిత్స చేయించుకున్న వైఎస్సార్ సీపీ నాయకులను, కార్యకర్తలను వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి శనివారం రాత్రి పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ వైఎస్సార్ సీపీ పార్టీ అండగా ఉంటుందన్నారు. ఇటీవల అనారోగ్యంతో మరణించిన మాజీ ఎంపీపీ పేర్ల గురవమ్మ, గాదె వెంకటరెడ్డి, చికిత్స చేయించుకున్న తిప్పారెడ్డి గోపాలరెడ్డి, పోగాకుల ఆంజనేయులును పరామర్శించారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బొమ్మిరెడ్డి సుబ్బారెడ్డి, వైస్ ఎంపీపీ పోతురెడ్డి సుజాత కోటిరెడ్డి, బూడిద శ్రీనివాసరావు, ముక్కా గురవయ్య, శ్రీనివాసరావు, కూరాకుల వెంకటేశ్వర్లు ఉన్నారు.

## ఉచిత వైద్య శిబిరానికి స్పందన



పరీక్ష చేసి మందులు సూచిస్తున్న వైద్యుడు

శావల్యాపురం: శ్రీరామా పబ్లిక్ స్కూల్ 25 సంవత్సరాల పూర్తి చేసుకున్న సందర్భంగా సుచరిత ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో కొత్తలూరు క్యాంపస్‌లో ఉచిత వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. సొసైటీ అధ్యక్షుడు కె.వి.ఆర్. మోహన్‌చందు ఆదివారం ఈ విషయం తెలిపారు. గుండె, క్యాన్సర్ వైద్య నిపుణులు పరీక్షలు నిర్వహించారు. 92 మందికి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. వైద్యులు కోసరాజు కమలాకర్, కందుల రాము, టి.మహతి, ఫణి, సుమన్, యశ్వంత్, చంద్రశేఖర్ వైద్యసేవలు అందించారు. శిబిరంలో ప్రిన్సిపల్ రత్నకుమారి, అజిత్‌చందు, మేఘన, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## సరికొత్తగా రోజా సమాచారం







రోజా సమయ సూచిక ప్రింటెడ్ కార్డులు

యడ్లపాడు: రంజాన్ నెలను ముస్లింలు అత్యంత పవిత్రంగా భావిస్తారు. ఈ మాసంలో ఉపవాస దీక్షలు ఎంతో క్రమశిక్షణతో పాటించాల్సి ఉంటుంది. సహార్ (ఉపవాస ప్రారంభం), ఇఫ్తార్ (ఉపవాస విరమణ) సమయాలను కచ్చితంగా పాటించాలి. ఈ నేపథ్యంలో ఉపవాస సమయాలు తెలుసుకోవడానికి ముద్రిత కార్డుల రూపంలో సమయ పట్టికలు అందుబాటులోకి వచ్చాయి. పురాతన కాలంలో గ్రామాల్లో తూటాలు పేల్చడం ద్వారా ఉపవాస సమయాన్ని తెలియజేసేవారు. ఆ తర్వాత బాణసంచా పేల్చడం ద్వారా, తరువాత మసీదుల్లో మౌజన్‌లు ఉపవాసం ప్రారంభానికి గంట ముందే మైకులో తెలిపేవారు. ఇప్పుడు ముద్రిత సమయ పట్టికలను అందుబాటులోకి తెచ్చారు.

## మహంకాళి ఆలయ తిరునాళ్లు ప్రారంభం



ప్రత్యేక అలంకరణలో మహంకాళి అమ్మవారు



పట్టువస్త్రాలు సమర్పిస్తున్న ఎంపీ లావు

నరసరావుపేట రూరల్: ఇస్సప్పాలెం మహంకాళి అమ్మవారి ఆలయ 50వ తిరునాళ్ల మహోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారికి ఉదయం విశేష పూజలు, ప్రత్యేక అలంకరణలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. పొంగళ్లు పొంగించి నైవేద్యం సమర్పించారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ మూర్తులతో గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయ ఈవో ఎస్.మాధవిదేవి ఏర్పాట్లు పర్యవేక్షించారు. సోమవారం అమ్మవారికి సమర్పణ, ఇస్సప్పాలెంలో గ్రామోత్సవం నిర్వహించనున్నారు. 18వ తేదీ మంగళవారం ఉత్సవపూర్ణాహుతి, అన్నదానం, తిరునాళ్ల జాగరణ జరుగనున్నాయి.

## ముగిసిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు



ప్రత్యేక అలంకరణలో స్వామి వారు



పూజల్లో బొల్లా బ్రహ్మనాయుడు దంపతులు

శావల్యాపురం: మండలంలోని వేల్పూరు గ్రామంలో వేంచేసియున్న శ్రీకళ్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారంతో ఘనంగా ముగిశాయి. ఆలయ ప్రధాన అర్చకుడు బీవీ మారుతీ రామచార్యులు ఆధ్వర్యంలో మూడో రోజు స్వామి వారి సన్నిధిలో తిరుపతి తిరుమల వేదపాఠశాల వేదపండితుల ఇనిమెట్ల అనంతచార్యులు, రుత్వీక్ శిష్య బృందం సారథ్యంలో స్వామి వారికి విశేష పూజలు, పూర్ణాహుతి, చక్రస్నానం, ద్వాదశ ప్రదక్షిణలు, ఏకాంత సేవ వైభవంగా నిర్వహించారు. మూలవిరాట్‌ను నూతన వస్త్రాలతో, పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకున్నారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వేడుకల సందర్భంగా దేవాలయాన్ని విద్యుత్ దీపకాంతులతో ముస్తాబు చేశారు.

## రామకృష్ణమాచార్యులు విగ్రహం ఏర్పాటు చేయాలి



నరసరావుపేట ఈస్ట్: శ్రీరామకృష్ణ ఓరియంటల్ ఉన్నత పాఠశాల డైమండ్ జూబ్లీ వేడుకల్లో పాఠశాల వ్యవస్థాపకులు వేదాంతం రామకృష్ణమాచార్యులు విగ్రహాన్ని ఆవిష్కరించాలని పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం తీర్మానించింది. పాఠశాలలో సంఘం ఆధ్వర్యంలో ఆదివారం డైమండ్ జూబ్లీ వేడుకల సన్నాహక సమావేశం నిర్వహించారు. త్వరలోనే వేడుకల తేదీని ప్రకటిస్తామన్నారు. సమావేశంలో పూర్వ విద్యార్థులు జూలకంటి సీతారామాంజనేయులు, రిటైర్డ్ స్టాటిస్టికల్ ఆఫీసర్ నాగరాజారావు, డాక్టర్ రొంపిచర్ల ఆంజనేయులు, వి.వి.అంజనీకుమార్, కోసూరి సుబ్బమ్మ, అపర్ణ తదితరులు పాల్గొన్నారు.